క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



బండిసంజయ్‌తో అనిల్‌యాదవ్ తదితరులు

శివ్వంపేట(నర్సాపూర్)/మనోహరాబాద్(తూప్రాన్): కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను తెలంగాణ రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి కన్వీనర్, రామ అగ్రోటెక్ డైరెక్టర్ అనిల్‌యాదవ్ తదితరులు ఢిల్లీలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా యాదవ సంఘానికి నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ నాయకులు మల్లేశ్, చంద్రశేఖర్ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. వంశీ, మనీష్ తదితరులున్నారు.

ఎస్పీని కలిసిన బీజేపీ నేతలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ గురువారం జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణకు తమ సహకారం ఉంటుందని హామీనిచ్చారు. ఆయన వెంట రాజు, మధు, శ్రీనివాస్, ఆంజనేయులు, బాబు, సిద్దిరాంరెడ్డి, భరత్, రాజేంద్రప్రసాద్, పంజాబాబు, జీపీస్వామి, జాల పోచయ్య తదితరులు ఉన్నారు.

యువకుడు అదృశ్యం



నవీన్(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): పొలం నుంచి గేదెలను తీసుకొస్తానని చెప్పి వెళ్లిన యువకుడు తిరిగి ఇంటికి రాలేదు. గురువారం ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నగొట్టిముక్లకు చెందిన చెన్నాపూర్ నవీన్(21) బుధవారం పొలంవద్ద నుంచి గేదెలను తీసుకొస్తానని తండ్రి యాదయ్యకు చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

11మంది జీపీఎస్‌లు బదిలీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో 11మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం తెలిపారు. మండలంలోని బూరుగడ్డకు మోహన్, ధర్మాసాగర్‌కు నరహరి, హరిచంద్ తండాకు కె.సృజిత, కూకుట్లపల్లికి జి.రమేశ్, కుషన్‌గడ్డ తండాకు రేణుక, మనంతయపల్లికి ఎస్.ప్రభాకర్, నాగ్సాన్‌పల్లికి మమత, పీర్యతండాకు రత్నయ్య, రాజిపేటకు నిర్మల, సదాశివపల్లికి వై.జ్యోతి బదిలీపై వచ్చారు. సదాశివపల్లిలో పంచాయతీ కార్యదర్శి బదిలీ కావడంతో గ్రామస్తులు సన్మానించారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ఎండీ జహీర్



ఎండీ జహీర్

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎండీ జహీర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన తారాబాయ్ నర్సాపూర్ ఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. జహీర్ సిద్దిపేట జిల్లా తొగుటలో విధులు నిర్వహించారు.

కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టాలి: బీజేపీ నేత



మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

నర్సాపూర్: కాంగ్రెస్ నాయకులు బీజేపీపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో కార్యకర్తలు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇవ్వలేదని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలలో నిజం లేదన్నారు. కలిసికట్టుగా ముందుకు సాగితే మున్సిపాలిటీ ఎన్నికలలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. సమావేశంలో రాజేందర్, ఉమ, రమణారావు, సురేశ్, బుచ్చేశ్ యాదవ్, యాదగిరి, నగేశ్, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

తండాల్లో తాగునీటి తిప్పలు

- వర్షాకాలంలోను కటకట
- బోర్‌లకు మరమ్మతులు
- ఆసరాగా వ్యవసాయ బావులు
- కన్నెత్తి చూడని అధికారులు



వ్యవసాయ బోరు నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న గిరిజనులు

మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. వర్షాకాలంలోనూ తాగు నీటి కోసం గిరిజనులు సతమతం అవుతున్నారు. మోటార్లు మరమ్మతులకు గురైనా, పైపులైన్‌లు పగిలిపోయి రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వారికి పొలాల్లోని బోరుబావులే దిక్కయ్యాయి.

– టేక్మాల్(మెదక్)

టేక్మాల్ మండలంలోని సర్మోనికుంటతండా పంచాయతీ పరిధిలోని బర్రెంకల్‌కుంట, మెర్గోనికుంట, టేక్మాల్‌తండాలలో వర్షం కురుస్తున్నా గిరిజనులు తాగునీటి కోసం తహతహలాడాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు పట్టించుకోపోవడంతో సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని వారు వాపోతున్నారు. తండాలలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వారం, పది రోజులుగా భగీరథ నీరు గ్రామాలకు సరఫరా కావడంలేదు. తండాల్లోని ప్రజలు వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్ సరఫరాలేని సమయంలో మరింత ఇబ్బందిగా మారుతోందని వాపోతున్నారు. నీటికోసం వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి గట్లపై పడుతూ లేస్తూ నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తండాల్లోని వాటర్ ట్యాంక్‌లను కూడా సరిగా శుభ్ర పరచడంలేదని వాపోయారు. మురుగు కాలువలు అపరిశుభ్రంగా మారడంతో దుర్గంధం వెదజల్లి అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని అధికారులు

తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అధికారులు ఎవరూ తండాలవైపు కన్నెత్తి చూడలేదు. పంచాయతీకి రాకుండా పత్తాలేకుండా పోయారు. మౌలిక వసతుల విషయమై ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని గిరిజనులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

మూడు ఇండ్లు పాక్షిక ధ్వంసం

వీడని ముసురు.. రోడ్లన్నీ చిత్తడి



కౌడిపల్లిలో కూలిన ఇల్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాలలో కురుస్తున్న వర్షాలకు మూడు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి గురువారం తెలిపారు. నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండడంతో మండలంలోని వెల్మకన్నలో పోల శ్రీరంగం, ధర్మసాగర్‌లో వడ్ల మల్లేశం, దేవులపల్లిలో మాదర బోయిన సంగయ్య పెంకుటిండ్లు పాక్షికంగా కూలినట్లు ఆయన చెప్పారు.

బురదమయంగా రోడ్లు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో మట్టి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. అడుగు తీసి అడుగువేని పరిస్థితి నెలకొంది. పనులపై బయటకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. వరినాట్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే పత్తి పంటలో నీరుచేరి దెబ్బతినే పరిస్థితి నెలకొంటుందని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.

నైపుణ్యాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లలితాదేవి

నర్సాపూర్ రూరల్: జీవిత నైపుణ్యాలపై అవగాహన అవసరమని గిరిజన గురుకుల బాలికల పాఠశాల(నారాయణపూర్) ప్రిన్సిపాల్ లలితాదేవి సూచించారు. హైదరాబాద్‌కు చెందిన వాయిస్ ఫర్ గరల్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో పరిచయ్ పేరుతో పది రోజులపాటు జీవిత నైపుణ్యంపై శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ముగింపు సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు జీవిత నైపుణ్యాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, లింగ వివక్ష, ప్రమాణాలు, సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రాథమిక హక్కు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రజని, అనూష, దీక్షిత పాల్గొన్నారు.

మొక్కలు పెంచితే మంచి ఆరోగ్యం

డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు



హవేళిఘణాపూర్(మెదక్): మొక్క నాటుతున్న శ్రీనివాసరావు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో అందరూ భాగస్వాములై మొక్కలు నాటితే పరిసరాలు పరిశుభ్రంగా ఉండి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిధిలోని స్కూల్‌తండాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు పెంచి వాటిని రక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, టీఏలు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు నాటాలి

కౌడిపల్లి(నర్సాపూర్): లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన మహోత్సవంలో ప్రతి పంచాయతీ పరిధిలోను నాలుగువేల మొక్కలు నాటలన్నారు. మురుగు కాలువలు శుభ్రంచేసి చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, పైపులైన్‌లలో లీకేజీలు ఉంటే సరిచేయాలని చెప్పారు. గ్రామాలలో డ్రైడే నిర్వహించి నీరు నిలువకుండా చూడాలని తెలిపారు. డెంగీ, మలేరియ జ్వరాలుపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం, ఏపీఓ పుణ్యదాస్ పాల్గొన్నారు.

రెండు ఇళ్లల్లో చోరీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇళ్లల్లో చొరబడి, నగదు, వెండితోపాటు, కొట్టంలో కట్టేసిన మేకలను అపహరించారు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం చండూర్‌లో గురువారం వెలుగుచూసింది. ఎస్ఐ షేక్ మహబూబ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చండూర్ గ్రామానికి చెందిన గుట్టమీది యాదమ్మ ఇంట్లో బుధవారం ఎవరూ లేకపోవడంతో ఇంటికి తాళం వేసి, తోడికోడలు గంగమ్మ ఇంట్లో పడుకుంది. యాదమ్మ గురువారం ఉదయం ఇంటి వచ్చేసరికి తలుపు తెరచి, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంట్లో వస్తువులు పరిశీలించగా, రూ.18వేల నగదు, 20తులాల వెండి, 3మాసాల బంగారం అపహరణకు గురయ్యాయని గమనించింది. పక్కనే ఉన్న లింగమ్మ ఇంట్లో కూడా దొంగతనం జరిగింది. అలాగే పాతూరి యాదగిరికి చెందిన ఆరు మేకలను అపహరించారు. వరుస దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఘటనా స్థలాలను పోలీసులు పరిశీలించారు.

విద్యుత్‌కు పాడిగేదె బలి



గేదె కళేబరం

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని మానెపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గరె బోయిన శ్రీశైలం గురువారం ఉదయం పశువులను మేతకు తరలిస్తుండగా ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి పాడిగేదె మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. నష్టపరిహారం అందించి అతడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అధిక బడ్జెట్ అందించాలి

కొల్చారం (నర్సాపూర్): పంచాయతీలుగా మారిన గిరిజన తండాలకు ప్రభుత్వం అధిక బడ్జెట్ కేటాయించాలని బహుజన జాగృతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యోహాన్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. గత ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చినా మౌలికసదుపాయాలు కల్పించలేదని వాపోయారు.

గురుకుల ప్రిన్సిపాల్‌గా ఫణికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఫణికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బదిలీపై వెళ్లడంతో ఇక్కడికి బద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్ముపేట నుంచి ఫణికుమార్ బదిలీపై వచ్చారు. దీంతోపాటు పలువురు ఉపాధ్యాయులు సైతం బదిలీపై వచ్చారు.

జీఎమ్మార్ ఆధ్వర్యంలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న జీఎమ్మార్ సిబ్బంది, విద్యార్థినులు

తూప్రాన్: పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలలో గురువారం జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ మొక్కలు నాటడం మన అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ సంధ్యారాణి, వందన, ఏటీపీ అర్షియా తరుణం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజిరెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కె.వెంకటపూర్‌లో గురువారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మురుగునీరు చేరకుండా చూసుకోవాలని, దోమల వల్ల విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, కార్యదర్శి ప్రేమ, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

500 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్

రామాయంపేట(మెదక్): వివేకానంద విద్యాలయంలో గురువారం హైదరాబాద్ సన్‌రిచ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు చరణ్, రవితేజ ఐదు వందల మంది పిల్లలను పరీక్షించి అవసరమైనవారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని సూచించారు. హెచ్ఎం రాంకుమార్, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ప్రాంతాల్లో సీసీరోడ్లు



తాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్: పట్టణ శివారులోని పిల్లికోటాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంల ప్రాంతాలకు త్వరలో సీసీరోడ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. ఆటోమెటిక్ క్లోరినేషన్ ఆన్‌లైన్ మానటరింగ్(ఆకాం) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం డబుల్ బెడ్రూం వీధిలోని తాగునీటి ట్యాంకు వద్ద ఆ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. స్వచ్ఛమైన నీరు అందిస్తున్న అకాం సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్‌లు శేఖర్, లింగం, మధుసూదన్, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు పవన్, రాజేశ్, జీవన్‌రావ్, గంగాధర్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి ఎందుకు పిలవలేదు?



ఆర్‌డీఓకు వివరాలు అందజేస్తున్న రైతులు

నర్సాపూర్: రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా కన్పించడం లేదా కలెక్టర్ ఏర్పాటు చేసిన రైతుల సమావేశానికి తమను ఎందుకు పిలువలేదని దీక్షలలో కూర్చుంటున్న రైతులు అధికారులను ప్రశ్నించారు. సంగారెడ్డి కాలువకు భూములు ఇవ్వమబోని చేపట్టిన రైతుల నిరాహార దీక్షలు గురువారం నాటికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బుధవారం నర్సాపూర్‌లో లెక్టర్ రాహుల్‌రాజ్ ట్రిబుల్ ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం ఏర్పాటు చేయగా స్థానిక అధికారులు దీక్షలు చేస్తున్న తమకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. రైతుల అభిప్రాయాలు తీసుకోవడానికి మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డిని కలిసి తమ ఆవేదనను వినిపించారు. సంగారెడ్డి రీచ్ కాలువకు సుమారు 18ఎకరాల భూములను తాము కోల్పోతున్నామని చెప్పారు. మార్కెట్ రేట్‌ను బట్టి తమకు పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం వాయిదా



మాట్లాడుతున్న డీసీఓ కరుణ

టేక్మాల్(మెదక్): టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై డైరెక్టర్‌లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం శుక్రవారం నాటికి వాయిదా పడింది. గత 3వ తేదీన జిల్లా కో–ఆపరేటివ్ అధికారి కరుణకు డైరెక్టర్‌లు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం పీఏసీఎస్ కార్యాలయంలో డీసీఓ అరుణ సమావేశం నిర్వహించగా అవిశ్వాస పరీక్షకు 8మంది కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్‌లు హాజరయ్యారు. మధ్యాహ్నం 1గంట తర్వాత డైరెక్టర్‌లలో ఒకరు మృతి చెందగా మొత్తం సభ్యులలో మూడింట రెండో వంతు సభ్యులు హాజరు కాలేదు. సభ్యులతో మరోసారి చర్చించిన డీసీఓ అనివార్య కారణాల వల్ల అవిశ్వాసం వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. అవిశ్వాస సమయంలో రెండు పార్టీల నాయకులు గుమిగూడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అల్లాదుర్గం సీఐ రేణుక బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ పేదలకు అన్యాయం

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించారని రాష్ట్ర అభివృద్ధికి నిధులు తీసుకువచ్చే బాధ్యత బీజేపీ ఎంపీలదేనని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మల మైసయ్య అన్నారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ వల్ల పెద్దలకే ప్రయోజనం తప్ప పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు మేలు జరుగుతుండగా నిధుల తగ్గించడం ఏమిటని ప్రశించారు. అది ఉపాధికూలీలకు అన్యాయం చేయడమేనని వాపోయారు. బీజేపీ ఎంపీలు కేంద్రాన్ని ప్రశ్నించాలని చెప్పారు.

◆ గ్రామాభివృద్ధికి కృషి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రజలు, పాలకులు, అధికారుల సమిష్టి కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీఓ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన చిట్కుల్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో చెత్తా చెదారాలు లేకుండా చూస్తున్నామన్నారు. డంపింగ్ యార్డులో ఘన, ద్రవ వ్యర్థాలకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

◆ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాసాయిపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం ధర్మపురి సూచించారు. విద్యార్థులకు సాఫ్ట్ బాల్ క్రీడను పరిచయం చేసి నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు రంగారెడ్డి, రాజేశ్వర్‌రావ్, భాగ్యలక్ష్మి, హరిరంజన్‌శర్మ, పీడీ శ్యాంసుందర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

◆ రుణమాఫీ రాలేదు..

కౌడిపల్లి(నర్సాపూర్): రుణమాఫీ రాలేదు చెక్ చేయండని రైతులు వ్యవసాయ కార్యాలయం, బ్యాంక్‌ల వద్ద పడిగాపులు పడుతున్నారు. మాఫీ కాని రైతులు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో వివిధ గ్రామాల రైతులు గ్రీవెన్స్‌లో పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌తో వచ్చి సరిచేసుకుంటున్నారు. అధికారులు పరిశీలించి దరఖాస్తులను తీసుకుంటున్నారు.

◆ వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

నర్సాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలోని పోచమ్మతల్లి ఆలయం ఎదుట గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 29న అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమాలలో భిక్షపతి, సర్వేష్, చంద్రయ్య, కృష్ణ, జలంధర్, శ్రీనివాస్, మహేశ్, రాములు, మల్లేశం, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఉర్దూలోను బోర్డులు పెట్టాలి

మెదక్ కలెక్టరేట్: ఆర్టీసీ బస్సులలో సైన్‌బోర్డులు తెలుగుతోపాటు ఉర్దూలోనూ ఏర్పాటు చేయాలని టీయూడబ్ల్యూజే నాయకులు ఇంతియాజుద్దీన్, యూసుఫ్ అలీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. మెదక్ డిపోకు చెందిన బస్సుల రూట్లలో సైన్ బోర్డులు కేవలం తెలుగులో ఉన్నందున ముస్లిం విద్యార్థులు, మహిళలు ఇబ్బందులకు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కోరారు.

◆ ఆర్థిక సహాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని కొంతాన్‌పల్లిలో పెద్దిపల్లి లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను సొసైటీ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి గురువారం పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సొసైటీ నుంచి మరో రూ.5వేలు అందజేశారు. ఆయన వెంట రవీందర్‌రెడ్డి, మధు, రాములు, శంకర్, వెంకటేశం, భాను తదితరులు ఉన్నారు.

◆ ఘనంగా మహంకాళీ ఉత్సవాలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహంకాళీ దేవికి ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలతోపాటు భక్తులు అమ్మవారికి వస్త్రాలు, ఒడిబియ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం తెప్పోత్సవం, సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయులకు వీడ్కోలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కరీంనగర్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సలోమీ, మానస, మమతను పాఠశాల సిబ్బంది గురువారం సన్మానించారు. వారు వెళ్తుండడంతో విద్యార్థులు కంటతడి పెట్టారు.